సాక్షి
కామారెడ్డి
సోమవారం । 16 । అక్టోబర్ । 2023



కొనసాగుతున్న జోనల్ క్రీడలు
బాన్సువాడలోని బోర్లం క్యాంపులో గురుకుల విద్యాలయాల జోనల్ క్రీడాపోటీలు కొనసాగుతున్నాయి.
- 10లో ▸



మూలనపడ్డ ట్రాక్టర్లు
ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో నిర్వహణ లేక గ్రామ పంచాయతీల ట్రాక్టర్లు మూలన పడుతున్నాయి.
- 12లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
38.8 /18.6

వాతావరణం
ఉదయం ప్రకాశవంతంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజావాణి రద్దు

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల దృష్ట్యా అధికారులందరూ నోడల్ అధికారులుగా వివిధ రకాల ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నారని పేర్కొన్నారు. అందుకే ప్రజావాణి కార్యక్రమాన్ని ఎన్నికలు పూర్తయ్యే వరకు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

సీఎం సభాస్థలి పరిశీలన



నిజాంసాగర్: జుక్కల్ నియోజకవర్గంలో ఈనెల 30న ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొనే అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ నాయకులు ఆదివారం పరిశీలించారు. నాందేడ్– సంగారెడ్డి జాతీయ రహదారి పక్కన జుక్కల్ చౌరస్తా వద్ద సభకు అనువైన స్థలం ఉన్నట్లు నాయకులు గుర్తించారు. బహిరంగ సభతో పాటు వాహనాల పార్కింగ్, హెలిప్యాడ్ స్థలాలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జుక్కల్, బిచ్కుంద మండలాల బీఆర్ఎస్ నాయకులు నీలుపటేల్, శివానంద్‌పటేల్, సాయాగౌడ్, రవిపటేల్, నాల్చర్ రాజు, హన్మండ్లు, అనితా సింగ్ తదితరులు ఉన్నారు.

'సాహితీ ఘనాపాటి గన్ను కృష్ణమూర్తి'



కామారెడ్డి అర్బన్: కవి, రచయిత, విమర్శకులు, గేయ రచయిత దివంగత గన్ను కృష్ణమూర్తి అన్ని సాహితీ ప్రక్రియల్లో రచనలు చేసి తెలుగు సాహిత్యంలోనే గొప్ప కవుల సరసన నిలిచారని ప్రముఖ కవి కొల్లు రంగారావు పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గన్ను కృష్ణమూర్తి రచించిన 'శత కోటి రహస్యాలు' పరిశోధన గ్రంథాన్ని ఆవిష్కరించారు. అందరూ మెచ్చే రచనలు చేసిన ఘనాపాటి గన్ను కృష్ణమూర్తి అని వక్తలు కొడియాడారు. కార్యక్రమంలో తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్, ప్రతినిధులు రామస్వామి, సురారం శంకర్, అల్లి మోహన్ రాజ్, గంగాప్రసాద్, పీతాంబర్, నాగభూషణం, వైద్య శేషారావు, కరుణాకర్, అమరేషం ప్రసాద్, లక్ష్మీలీల, సాయితేజ, కాత్యాయిని, అశోక్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్‌నుంచి బీ ఫాం అందుకుంటున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి



కేసీఆర్ తరఫున గంప..




నల్లమడుగు సురేందర్



హన్మంత్ సింధే

ఇక జనంలోకి..

- జీ ఫాంలు అందుకున్న అభ్యర్థులు
- కేసీఆర్ తరఫున బీ ఫాం తీసుకున్న గంప గోవర్ధన్
- కొత్త మేనిఫెస్టోతో శ్రేణుల్లో సంతోషం



కొత్త పథకాలతో ఊపు..

బీఆర్ఎస్ మేనిఫెస్టో ఆ పార్టీ నేతల్లో జోష్ తెచ్చింది. కొత్త పథకాలతో తమ పార్టీ తిరుగులేని విజయం సాధిస్తుందన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. మెనిఫెస్టో ప్రకటించిన తర్వాత సంబురాలు షురూ చేశారు. ఆసరా పింఛన్లు, రైతుబంధు పెంపుతో పాటు ప్రజలందరికీ ఆరోగ్య శ్రీ వైద్య సేవల వ్యయం రూ.15 లక్షలదాకా పెంచడం, మహిళలకు రూ.3 వేల జీవనభృతి, రైతుబంధు పెంపు, తెల్ల రేషన్ కార్డులకు సన్నబియ్యం సరఫరా, అగ్రవర్ణ పేదల కోసం నియోజకవర్గానికో గురుకుల పాఠశాల తదితర పథకాలతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.

సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల కోసం అభ్యర్థుల ప్రకటనలో ముందున్న బీఆర్ఎస్.. మరో అడుగు ముందుకేసింది. అభ్యర్థులకు బీ ఫాంలతో పాటు ఎన్నికల ఖర్చుల కోసం రూ.40 లక్షల చొప్పున చెక్కులను అందించింది. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవనలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫాంలు అందించారు. బాన్సువాడ అభ్యర్థి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి నుంచి ఎమ్మెల్యే జాజాల సురేందర్, జుక్కల్ నుంచి ఎమ్మెల్యే హన్మంత్ సింధే బీ ఫాంలు అందుకున్నారు. కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండగా.. ఆయన తరఫున ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ బీ ఫాం స్వీకరించారు. బాల్కొండ అభ్యర్థి ప్రశాంత్‌రెడ్డి తరఫున ఎమ్మెల్సీ కవిత, నిజామాబాద్ అర్బన్ స్థానంనుంచి బిగాల గణేశ్ గుప్తా, రూరల్‌లో బాజిరెడ్డి గోవర్ధన్, ఆర్మూర్‌లో జీవన్‌రెడ్డి, బోధన్ నియోజకవర్గంనుంచి షకీల్ బీ ఫాంలు అందుకున్నారు. అభ్యర్థులంతా జనంలోకి వెళ్లాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ప్రజలతో మమేకం కావాలని, ప్రభుత్వం చేసిన ప్రగతి, అందించిన సంక్షేమాన్ని వివరించడంతో పాటు కొత్తగా ప్రకటించిన హామీలపై ప్రజలకు అర్థం చేయించాలని సూచించారు. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థులంతా ఇక కదనరంగంలోకి దూకనున్నారు. సోమవారం నుంచి నియోజకవర్గాల్లో ప్రచారంలో దూసుకుపోయేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చేరోజు వరకు ఎమ్మెల్యేలందరూ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో బిజీగా గడిపారు. జనం మధ్యనే తిరిగారు. కుల సంఘాల భవనాలు, ఆలయాలకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తూ వాటికి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను అందించారు.

నెలన్నర సమయం..

ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం అసెంబ్లీ ఎన్నికలకు సరిగ్గా నెలన్నర సమయం ఉంది. ఆయా నియోజకవర్గాల్లో జనం వద్దకు వెళ్లడానికి రోజూ మూడు, నాలుగు గ్రామాలు తిరగాల్సిందే. అలా తిరిగితేనే అన్ని గ్రామాలను సందర్శించగలరు. కామారెడ్డి నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నందున బీఆర్ఎస్ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే నియోజకవర్గంలో ప్రతి వంద మంది ఓటర్లకు ఒక నాయకుడిని ఇన్‌చార్జీగా, ప్రతి బూత్‌కు పది మంది చొప్పున నియమించింది. బూత్ కమిటీలకు సంబంధించిన జాబితాలను ఇప్పటికే రెడీ చేసింది. 266 బూత్‌లకు పది మంది చొప్పున దాదాపు 2,660 మంది నాయకులు, కార్యకర్తలు ఇన్‌చార్జీలుగా ఉంటారు. వారంతా ప్రతి ఓటరును కలిసి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించడంతో పాటు సంక్షేమ పథకాలు ఆ ఇంటికి ఎన్ని అందాయన్నది చెప్పి ఓట్లు అడిగేలా ప్రణాళిక రూపొందించారు. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని పర్యవేక్షించేందుకు మంత్రి కేటీఆర్‌తో పాటు, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డిలను ఇన్‌చార్జీలుగా నియమించారు. ఎల్లారెడ్డి ఇన్‌చార్జి బాధ్యతలను మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌కు అప్పగించారు. బాన్సువాడ, జుక్కల్ నియోజక వర్గాలకు ఇన్‌చార్జీలను ప్రకటించాల్సి ఉంది.



ప్రశాంత్‌రెడ్డి తరఫున కవిత..



బిగాల గణేశ్ గుప్తా



బాజిరెడ్డి గోవర్ధన్



షకీల్



జీవన్‌రెడ్డి



భిక్కనూరు మండలం జంగంపల్లిలో కొలువుదీరిన దుర్గామాత

కొలువుదీరిన దుర్గమ్మ

జిల్లాలో ఆదివారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు మండపాలలో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు అమ్మవారి విగ్రహాలను శోభాయాత్రగా మండపాలకు తీసుకుని వచ్చారు. అమ్మవారు తొలిరోజు బాలా త్రిపురసుందరి దేవిగా దర్శనమిచ్చారు.

ధాన్యంపై వానర సేన దాడి



లింగంపేట: ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యంపై వానర సేన దాడి చేస్తూ అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. లింగంపేట మండలం శెట్పల్లిసంగారెడ్డి రైతులు వరి నూర్పిడి చేసి గ్రామ శివారులోని రోడ్డుపై ఆరబోశారు. అయితే వానర సేన ఒక్కసారిగా వచ్చి ధాన్యంపై దాడి చేస్తుండడంతో ఏం చేయాలో అర్థంకాని స్థితిలో రైతులున్నారు. వందలాది కోతులు ఒక్కసారిగా వచ్చి ధాన్యాన్ని అటుఇటు పారబోస్తూ నష్టం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడద నుంచి కాపాడాలని అధికారులను కోరుతున్నారు.

హస్తం గూటికి 'ఏనుగు'!

- పీసీసీ చీఫ్‌ను కలిసిన రవీందర్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిక లాంఛనమే

సాక్షి, కామారెడ్డి: ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి హస్తం గూటికి చేరడం ఖాయమైపోయింది. ఆయన ఆదివారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిశారు. కొంతకాలంగా రవీందర్‌రెడ్డి బీజేపీలో క్రియాశీలకంగా లేరు. పార్టీ కార్యక్రమాలలో పాల్గొనడం లేదు. దీంతో ఆయన పార్టీ మార్పుపై రెండుమూడు నెలలుగా చర్చ నడుస్తోంది. ఆయన ఎల్లారెడ్డి టికెట్టు ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారని.. అక్కడ సుభాష్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావుల మధ్య తీవ్ర పోటీ ఉండడంతో ఆ పార్టీ హైకమాండ్ ఎలాంటి భరోసా ఇవ్వలేకపోయిందని సమాచారం. ఈ నేపథ్యంలో రవీందర్‌రెడ్డి తన భార్యను ఎల్లారెడ్డి బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలపడానికి ప్రయత్నిస్తున్నట్లు ఇటీవల ప్రచారం జరిగింది. కానీ ఆయన ఆదివారం పీసీసీ చీఫ్‌ను కలవడంతో పార్టీ మారడం ఖాయమైంది. ఆదివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావ్‌తో పాటు మరికొందరితో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమావేశమై కాంగ్రెస్‌లోకి ఆహ్వానించినట్లు తెలిసింది. త్వరలోనే ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారని భావిస్తున్నారు. కాంగ్రెస్ ఆయనను బాన్సువాడ నుంచి బరిలో నిలిపే అవకాశాలున్నాయి.



పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఇతర నేతలతో ఏనుగు రవీందర్‌రెడ్డి

ప్రవల్లికది ప్రభుత్వ హత్యే

- అంశాన్ని పక్కదారి పట్టించడానికి సర్కారు యత్నం
- బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి ఆరోపణ




మాట్లాడుతున్న కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: గ్రూప్–2 అభ్యర్థి ప్రవల్లికది ఆత్మహత్య కాదని, అది ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్యేనని బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి ఆరోపించారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వానికి వైన్‌షాప్‌ల టెండర్లపై ఉన్న శ్రద్ధ పరీక్షల నిర్వహణపై లేదన్నారు. ప్రవల్లిక ఆత్మహత్య కేసును రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు కలిసి పక్కదారి పట్టించాలని చూడడం దారుణమన్నారు. ఉద్యోగం రాదన్న బెంగతోనే ప్రవల్లిక ఆత్మహత్య చేసుకుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడంలో తెలంగాణ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదన్నారు. ఉద్యోగాలకోసం యువత ధైర్యంగా బీఆర్ఎస్, కేసీఆర్‌పై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఓవైపు ఉద్యోగం రాక నిరుద్యోగి ఆత్మహత్య చేసుకుంటే బీఆర్ఎస్ నేతలకు మాత్రం రాజకీయమే ముఖ్యమైందన్నారు. కాంగ్రెస్‌ను వీడిన పొన్నాల లక్ష్మయ్యను పార్టీలో చేర్చుకోవడం కోసం ఆయన వద్దకు వెళ్లిన కేటీఆర్‌కు ప్రవల్లిక ఇంటికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చే ధైర్యం లేకపోయిందన్నారు. కేసీఆర్‌ను ఫాం హౌస్‌కే పరిమితం చేయాలని కోరారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఉద్యోగులకు, నిరుద్యోగులకు న్యాయం చేస్తుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తొలి జాబితాలో చోటేదీ?

- కాంగ్రెస్ టికెట్లపై శ్రేణుల్లో అయోమయం
- కేసీఆర్ ప్రత్యర్థిగా షబ్బీర్ పేరు లేకపోవడంపై అంతటా చర్చ
- ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడలపై కొనసాగుతున్న ఉత్కంఠ
- రెండు మూడు రోజుల్లో స్పష్టత రావొచ్చంటున్న నేతలు



సాక్షి, కామారెడ్డి: కాంగ్రెస్ విడుదల చేసిన తొలి జాబితాలో కామారెడ్డి జిల్లాకు చోటు దక్కలేదు. ఉమ్మడి జిల్లాలో తొమ్మిది నియోజకవర్గాలుండగా.. బోధన్‌లో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. బాల్కొండలో సునీల్‌రెడ్డిని, ఆర్మూర్‌లో వినయ్‌రెడ్డిని బరిలో నిలిపింది. కాగా జిల్లాలో నాలుగు నియోజకవర్గాలుండగా ఒక్క స్థానంలోనూ అభ్యర్థిని ప్రకటించకపోవడంతో పార్టీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు.

కాంగ్రెస్ ప్రకటించే తొలిజాబితాలో కామారెడ్డి నుంచి షబ్బీర్ అలీ పేరు ఉంటుందని అందరూ భావించారు. ఇక్కడ ఆయన అభ్యర్థిత్వంపై ఎలాంటి వివాదం, అభ్యంతరాలు లేవు. ఈసారి ఎలాగైనా విజయం సాధించాలన్న పట్టుదలతో ఆయన నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అయితే కాంగ్రెస్ ప్రకటించిన తొలి జాబితాలో కామారెడ్డి స్థానం లేకపోవడం చర్చకు దారితీసింది.

ఎల్లారెడ్డి నుంచి మదన్‌మోహన్‌రావు, సుభాష్‌రెడ్డిల మధ్య టికెట్టుకోసం పోటీ ఉంది. అయితే ఇద్దరిలో ఒకరు బాన్సువాడకు వెళ్లాలని పార్టీ అధిష్టానం సూచించినట్లు తెలుస్తోంది. అయితే ఇద్దరు కూడా ఎల్లారెడ్డినుంచే పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ ఎవరిని ఎంపిక చేస్తారన్న దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ టికెట్టు రానివారు రెబల్‌గా బరిలో దిగుతారన్న ప్రచారమూ ఉంది. బాన్సువాడ పరిస్థితీ అంతే.. ఇక్కడ నియోజకవర్గ ఇన్‌చార్జీగా ఉన్న కాసుల బాల్‌రాజు ఈసారి కూడా తనకే టికెట్టు వస్తుందన్న ధీమాతో ఉన్నారు. అయితే ఆయన అభ్యర్థిత్వాన్ని పలువురు నేతలు వ్యతిరేకిస్తున్నారు. దీంతో బాన్సువాడ కూడా పెండింగ్‌లోనే ఉంది. జుక్కల్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే గంగారాంను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అయితే ఆయన అభ్యర్థిత్వాన్ని తొలి జాబితాలో ప్రకటించలేదు. కాంగ్రెస్ పార్టీ రెండో జాబితా విషయంలో మరో రెండు మూడు రోజులు వేచిచూడాల్సిందేనని భావిస్తున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల అభ్యర్థులను ఒకేసారి ప్రకటించే అవకాశాలున్నాయి.

20న ఇందూరుకు రాహుల్‌గాంధీ

- బోధన్‌లో బీడీ, గల్ఫ్‌కార్మికులతో సమావేశం
- నిజాంషుగర్ ఫ్యాక్టరీ సందర్శన
- ఆర్మూర్‌లో రైతులతో మీటింగ్
- జిల్లా కేంద్రంలో పాదయాత్ర

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లాలో ఎట్టకేలకు ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పర్యటనను ఏఐసీసీ ఖరారు చేసింది. 20వ తేదీన ఆయన జిల్లాలో పర్యటించనున్నారు. కాంగ్రెస్ నాయకులు రాహుల్ పర్యటన షెడ్యూల్ విడుదల చేశారు.

రాహుల్ గాంధీ మొదట బోధన్‌కు వస్తారు. ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు బోధన్‌లో పర్యటిస్తారు. బీడీ, గల్ఫ్ కార్మికులతో వారి సమస్యలపై చర్చిస్తారు. అనంతరం మూతపడిన నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని సందర్శించి వివరాలు తెలుసుకుంటారు. అక్కడినుంచి ఆర్మూర్‌లో పర్యటించి, బహిరంగ సభలో మాట్లాడతారు. పసుపు, చెరుకు రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటారు. ఆర్మూర్‌లో సమావేశం అనంతరం నిజామాబాద్‌లో పాదయాత్ర చేస్తారు.

కాంగ్రెస్ జాబితా..

కాంగ్రెస్ బోధన్ అభ్యర్థిగా మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, ఆర్మూర్‌నుంచి వినయ్‌కుమార్, బాల్కొండ నుంచి సునీల్‌రెడ్డిలను ప్రకటించింది. మిగిలిన నియోజకవర్గాల అభ్యర్థులను తేల్చలేదు. రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో ఈనెల 18న మరో జాబితా విడుదలయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆ జాబితాలో నిజామాబాద్ అర్బన్ అభ్యర్థిని తేలుస్తారని సమాచారం.

చేతకాని సీఎంకు రిటైర్మెంట్ ఇప్పిస్తాం

- కాంగ్రెస్ మేనిఫెస్టోను కాపీ కొట్టిన బీఆర్ఎస్
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్/భిక్కనూరు: పాలన చేతకాని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రిటైర్మెంట్ ఇప్పిస్తామని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో భిక్కనూరు మండల కేంద్రంతోపాటు తిప్పాపూర్, అంతంపల్లి, మాచారెడ్డి మండలం ఎల్లంపేట, కాకులగుట్ట తండాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కేసీఆర్.. ప్రజలను మభ్యపెట్టేందుకు కొత్త హామీలను ఇవ్వడం సిగ్గు చేటన్నారు. కేసీఆర్ కాంగ్రెస్ మేనిఫెస్టోను కాపీ కొట్టారన్నారు. కాంగ్రెస్‌వి సాధ్యం కాని హామీలంటూ విమర్శించిన కేటీఆర్.. మరీ అవే హామీలపై కేసీఆర్ విడుదల చేసిన మేనిఫెస్టోపైనా స్పందించాలన్నారు. తమ గ్యారంటీ పథకాలపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారని, ఈసారి కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యమని పేర్కొన్నారు. కార్యకర్తలు ప్రతి గడపకు వెళ్లి గ్యారంటీ పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, నాయకులు సుధాకర్‌రెడ్డి, భీంరెడ్డి, బల్యాల రేఖ సుదర్శన్, ఎడ్ల రాజిరెడ్డి, దుంపల మోహన్‌రెడ్డి, లింబాద్రి, దయాకర్‌రెడ్డి, ధర్మయ్య, సిద్ధరాములు, సురేశ్, బాబు, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

క్లుప్తంగా

రంగు మారుతున్న ఎస్సారెస్పీ నీరు



బాల్కొండ: ఎస్సారెస్పీలో నిల్వ ఉన్న నీరు మళ్లీ రంగు మారుతోంది. నెల రోజుల క్రితం ప్రాజెక్ట్ నీరు రంగు మారడంతో కలెక్టర్ వచ్చి నీటిని పరిశీలించారు. పరీక్షల నిమిత్తం శాంపిళ్లను పంపించాలని అధికారులను ఆదేశించారు. కానీ పరీక్షల ఫలితాలు ఇంకా రాలేదు. ఇంతలో ప్రాజెక్టు నీరు మళ్లీ రంగు మారడంతో ప్రాజెక్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు చరిత్రలో ఎనాడు రంగు మారలేదని దశాబ్ద కాలంగా ఎస్సారెస్పీ నీరు రంగు మారుతోందని స్థానిక రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఉన్నత అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'బీఎల్ఎఫ్‌ను గెలిపించాలి'



కామారెడ్డి టౌన్: అవినీతి లేని సమాజం కోసం బీఎల్ఎఫ్‌ను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర చైర్మన్ నల్ల సూర్య ప్రకాష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో పార్టీలు, నాయకులు, జెండాలు మారిన పేదల బతుకులు మారడం లేదన్నారు. బీఎల్ఎఫ్ కామారెడ్డి అసెంబ్లీ అభ్యర్థి, కార్మిక పోరాట నాయకుడు సిద్దిరాములును గెలిపించాలని ఓటర్లను కోరారు. దండి వెంకట్, ఆంజనేయులు, వడ్ల సాయి కృష్ణ, గంగమణి, సబిత తదితరులున్నారు.

ప్రమాదకరంగా వాటర్ ట్యాంక్



తాడ్వాయి: మండలంలోని కృష్ణాజీవాడి ప్రభుత్వ పాఠశాల ఆవరణలతో ఉన్న మంచి నీటి ట్యాంకు ప్రమాదకరంగా మారింది. ట్యాంక్ నుంచి పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో పిల్లర్లకు సంబంధించిన పెద్దపెద్ద పెచ్చులు ఊడి కిందపడిపోతున్నాయి. దీంతో ట్యాంకు కూడా కూలే అవకాం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలో విద్యార్థులు ఉన్న సమయంలో ట్యాంక్ కూలితే పెద్ద ప్రమాదం జరుగుతుంది. ప్రస్తుతం దసరా సెలవులు ఉన్న నేపథ్యంలో ట్యాంక్‌కు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లెక్క చెప్పాల్సిందే!

- ఎన్నికల వేళ అడుగడుగున నిఘా
- తనిఖీలు ముమ్మరం చేసిన పోలీసులు
- రూ.50 వేలు దాటితే పత్రాలు వెంట పెట్టుకోవాలి



ఎల్లారెడ్డిలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డి: రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో నగదు తరలింపుపై ఆంక్షలను ఎన్నికల కమిషన్ కఠినతరం చేసింది. ఎలక్షన్ కోడ్ అమలు కోసం పోలీసు, రెవెన్యూ యంత్రాంగాలు పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఇతర సిబ్బందితో జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నారు. ప్రజలు ప్రయాణాలు చేసేటప్పుడు అవసరం లేకుండా డబ్బులను వెంట తీసుకువెళ్లవద్దని పోలీసు అధికారులు అంటున్నారు. రూ.50 వేలకు మించి నగదు వెంట తీసుకెళ్తే పత్రాలు వెంటబెట్టుకోవాలని సూచిస్తున్నారు. జిల్లాలోని మద్నూర్ మండలం సలాబత్ పూర్, జుక్కల్ మండలం సోంపేట్ వద్ద రెండు అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. మాచారెడ్డి, స్టేషన్ భిక్కనూర్, పోచారం, నిజాంసాగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామం వద్ద, నస్రుల్లాబాద్ మండలం గండి, దగ్గి అటవీప్రాంతాలలో అంతర్ జిల్లాల చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. రెవెన్యూ యంత్రాంగంతో కలిసి జిల్లాలో ప్రతీ నియోజకవర్గానికి ఆరు చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్‌లు(ఎఫ్ఎస్‌టీ), ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమలు బృందాలు ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో ఏడు, కామారెడ్డి నియోజకవర్గానికి ఆరు బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. వీటితో పాటు ప్రతీ రెండు మండలాలకు ఒక వీడియో సర్వైలెన్స్ టీమ్ (వీఎస్‌టీ) ఏర్పాటు చేయగా, మూడు నియోజకవర్గాలలో ఆరు చొప్పున స్టాటికల్ సర్వైవల్ బృందాలను ఏర్పాటు చేశారు.

ఆధారాలు చూపాలి

ప్రజలు వివిధ అవసరాల కోసం రూ.లక్షల నగదు తీసుకెళ్లడం ప్రస్తుతం సాధారణమైపోయింది. ఆస్పత్రి అవసరాలు, వివాహాలు, భూముల క్రయ విక్రయాల సమయంలో పెద్ద ఎత్తున డబ్బులు తీసుకొని వెళ్తారు. కానీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50 వేలు దాటితే ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో ఖచ్చితమైన ఆధారాలు చూపాల్సిందేనని అధికారులు అంటున్నారు. బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేస్తే రసీదులు, ఏటీఎం నుంచి తీసుకుంటే ఏటీఎం రిసీప్ట్, ఇతరుల నుంచి అప్పుగా తీసుకుంటే అందుకు సంబంధించిన పత్రాలు తనిఖీ అధికారులకు చూపాల్సి ఉంటుంది. రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తులు సరైన ఆధారాలతో 10 లక్షల వరకు తీసుకెళ్లినా వదిలేస్తారు. సాధారణ ప్రజలు 10 లక్షల కన్నా ఎక్కువ తీసుకెళ్తే ఆధారాలు చూపినా తనిఖీ సిబ్బంది ఆదాయపు పన్ను అధికారులకు సమాచారం ఇస్తారు. అప్పుడు ఆదాయపు పన్ను అధికారులు అడిగిన పత్రాలు చూపాల్సి ఉంటుంది. బ్యాంకుల్లో పెద్ద మొత్తం నగదు విత్‌డ్రాల పైన కూడా నిఘా ఉంటుందని అధికారులు అంటున్నారు.

తిరిగి పొందడం ఎలా

తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న డబ్బును సిబ్బంది జిల్లా ట్రెజరరీ కార్యాలయంలో అప్పగిస్తారు. ఆ డబ్బుకు సంబంధించి ఆధారాలు అప్పటికప్పుడు చూపలేకపోతే ఆ తర్వాత కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసే కమిటీకి ఆధారాలు అందచేసి డబ్బులను తిరిగి పొందవచ్చు. ఈ కమిటీలో అడిషనల్ కలెక్టర్ కన్వీనర్‌గా, జిల్లా పరిషత్ సీఈవో, డీటీవోలు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీకి సమర్పించిన పత్రాలు సరైనవేనని వారు విశ్వసిస్తే తమ డబ్బులను తిరిగి పొందే వీలుంటుంది. పట్టుబడిన డబ్బులకు సంబంధించిన ఆధారాలు వారంలోగా అందజేయాల్సి ఉంటుంది. ఈ గడువు దాటితే స్వాధీనం చేసుకున్న డబ్బులను ఎన్నికల కోడ్ పూర్తయ్యాక ఇస్తారు. పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ డబ్బులను ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టులో అప్పగిస్తారు. ఈ డబ్బులను కోడ్ ముగిసిన తర్వాత కోర్టుకు సరైన ఆధారాలు చూపి తిరిగి పొందవచ్చు.

మద్యం రవాణాపైనా ఆంక్షలు

ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్న సమయంలో ఒక వ్యక్తి ఆరు ఫుల్ బాటిళ్లు (750 ఎంఎల్) లేదా 12 హాఫ్ బాటిళ్లు లేదా 24 క్వార్టర్ బాటిళ్లు, 90 ఎంఎల్ బాటిళ్లు 48 కలిగి ఉండి ప్రయాణాలు చేయవచ్చు. వీటితో పాటు 12 బీర్ బాటిళ్లు ఉన్నా ఎలాంటి అభ్యంతరాలు ఉండవు. కానీ తనిఖీలలో అధికారులు అడిగితే ఈ మద్యం బాటిళ్ల రవాణాకు తగిన కారణం చెప్పాల్సి ఉంటుంది. ఇంతకు మించి మద్యం రవాణా చేస్తే ఎక్సైజ్ అధికారులు ఆబ్కారీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తారు. ఇతర రాష్ట్రాల మద్యానికి ఎలాంటి అనుమతి ఉండదు.

మంత్రికి పలువురి పరామర్శ



నివాళి అర్పిస్తున్న ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

వేల్పూర్: మండల కేంద్రంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని పలువురు ఆదివారం పరామర్శించారు. ఇటీవల మంత్రి తల్లి మంజులమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె చిత్ర పటం వద్ద నివాళి అర్పించారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మంత్రిని పరామర్శించిన వారిలో రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేశ్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, లింగయ్యయాదవ్, ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు, క్రైస్తవులు ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నాగిరెడ్డిపేట: మండలంలోని తాండూర్ హైస్కూల్‌కు చెందిన 1997–98 సంవత్సరం పదో తరగతి పూర్వవిద్యార్థులు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం అ'పూర్వ' సమ్మేళనం నిర్వహించారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, జైపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నారాయణరెడ్డి, విఠల్‌రెడ్డి, సుభాష్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



వర్షిత్‌ను అభినందిస్తున్న కప్ ఇన్‌చార్జ్ డేవిడ్

సిరికొండ: జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు సిరికొండ సత్యశోధక్ పాఠశాల విద్యార్థి వర్షిత్ ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లోని ఓయూ మైదానంలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి అండర్–13 మేజర్ లీగ్ బేస్‌బాల్ కప్ పోటీల్లో వర్షిత్ తెలంగాణ స్ట్రైకర్స్ జట్టు తరఫున పాల్గొని జట్టు చాంపియన్‌షిప్ సాధించడంలో ప్రధానపాత్ర పోషించాడని ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వర్షిత్‌ను అమెరికాకు చెందిన ఎంఎల్‌బీ కప్ ఇండియా ఇన్‌చార్జి డేవిడ్ అభినందించారు. బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి మల్లేశ్‌గౌడ్, జట్టు కోచ్‌లు అనిల్, నరేశ్, సంతోష్ వర్షిత్ సన్మానించారు. జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

కొనసాగుతున్న జోనల్ క్రీడలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణులు



బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపులోగల తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయంలో జోనల్‌స్థాయి క్రీడలు కొనసాగుతున్నాయి. ఈనెల 13న ప్రారంభమైన పోటీలు ఈనెల 16న ముగియనున్నాయి. ఆదివారం అండర్ 14, 17, 19 విభాగాల్లో గెలుపొందిన వారికి ఆర్‌సీవో అలివేలు, డీసీవో కృతామూర్తి, ప్రిన్సిపల్ పద్మకుమారిలతో కలిసి బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్‌సీవో అలివేలు

కేసీఆర్ మేనిఫెస్టోను నమ్మే పరిస్థితి లేదు

- బీజేపీ నేత ధన్‌పాల్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, తొమ్మిదిన్నరేళ్ల పాలనలో అనేకమంది అమాయక యువకులు, అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. ఆదివారం నగరంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ప్రకటించిన మేనిఫెస్టోను అమలుచేయని కేసీఆర్‌ను కొత్త హామీలతో మరోసారి మోసం చేసేందుకు వస్తే ప్రజలు తరిమికొడతారన్నారు. మేనిఫెస్టోలో నిరుద్యోగుల ప్రస్తావన లేదని, వారికి ఎలాంటి అవకాశాలు లేవా? అని ప్రశ్నించారు. సౌభాగ్యలక్ష్మి పేరుతో రూ.3వేలు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదమని, నిరుద్యోగులకు ఇచ్చిన రూ.3016 హామీ నేటికీ అమలు కాలేదని గుర్తుచేశారు. ఈసారి మహిళలను మోసం చేసేందుకు కేసీఆర్ సిద్ధమయ్యారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పాలనపై ప్రజల విసిగివేసారిపోయారని, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకే గూటి పక్షులని ఆరోపించారు. పేదల అభ్యున్నతి ప్రధాని మోదీ, బీజేపీతోనే సాధ్యమన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల కోసం మేనిఫెస్టోను బీజేపీ రూపొందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీకి అవకాశమివ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు ఖైసర్, నాయకులు ప్రభాకర్, ఆమందు విజయ్, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

గోడలపై రాతల తొలగింపు



ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున నిబంధనల మేరకు మండలంలోని అన్ని చోట్ల గోడలపై రాసిన పార్టీల గుర్తులు, రాతలను పంచాయతీ ఉద్యోగులు సిబ్బందితో తొలగింపు పనులు చేపడుతున్నారు. ఇప్పటికే ఫ్లెక్సీలను తొలగించారు. గతంలో కొన్ని పార్టీలు ప్రభుత్వానికి సంబంధించి, పార్టీకి సంబంధించిన రాతలను గోడలపై రాయించాయి. వీటిని ఆయా జీపీ కార్యదర్శులు దగ్గర ఉండి తొలగింపు పనులు చేపడుతున్నారు. - మోర్తాడ్

క్రైం కార్నర్

గోపాల్‌పేటలో వృద్ధుడి అదృశ్యం




నాగిరెడ్డిపేట: మండలంలోని గోపాల్‌పేటకు చెందిన ఆత్మకూరి దుర్గయ్య మూడు రోజుల క్రితం అదృశ్యమైనట్లు ఎస్సై రాజు తెలిపారు. దుర్గయ్య ఈ నెల 13న ఆసుపత్రిలో చూయించుకుంటానని మెదక్‌కు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దుర్గయ్య కుమారుడు బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రూ. 4 లక్షల నగదు పట్టివేత



భిక్కనూరు: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో ఒకరి నుంచి రూ. నాలుగు లక్షల నగదును శనివారం రాత్రి పట్టుకున్నట్లు కామారెడ్డి డీఎస్పీ ప్రకాశ్, సీఐ తిరుపయ్య, ఎస్సై సాయికుమార్ తెలిపారు. నిర్మల్ పట్టణానికి చెందిన అఖిల్ తన కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా భిక్కనూరు చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేశారు. తనిఖీలో రూ. నాలుగు లక్షల నగదుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్ స్కాడ్ బృందానికి అప్పగించినట్లు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



నిజామాబాద్ రూరల్: రూరల్ పరిధిలో పీడీఎస్ బియ్యంతో అక్రమంగా తరలుతున్న లారీని పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్ కుమార్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు 340 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలుతున్నట్లు సమాచారం అందడంతో నగర శివారులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు చెప్పారు. లారీని సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బాల్కొండలో గంజాయి స్వాధీనం

బాల్కొండ: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపడుతుండగా 350గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై గోపీ ఆదివారం తెలిపారు. నిర్మల్ నుంచి ఆర్మూర్ వైపు వస్తున్న ఆటో పోలీసులను చూసి డ్రైవర్ తిప్పడంతో వారిని వెంబడించి పట్టుకున్నారు. ఆటోలో ఉన్న షేక్ ముక్తార్, షేక్ రిజ్వాన్ నుంచి 350గ్రాముల గంజాయి లభించడంతో వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బెల్ట్‌షాప్‌పై దాడి

పెద్దకొడప్‌గల్: మండలంలోని అంజని గ్రామంలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై కోనారెడ్డి ఆదివారం తెలిపారు. దాడిలో మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

కామారెడ్డి క్రైం: మద్యం తాగి ఎందుకు జులాయిగా తిరుగుతున్నావని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై తావూనాయక్ ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఝాన్సిలింగాపూర్ గ్రామానికి చెందిన అనిల్ కుమార్ (23) కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయమై కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురైన అనిల్‌కుమార్ గ్రామ సమీపంలోని రైలు పట్టాలపై గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విచారణ చేపట్టి కేసు నమోదు నమోదు చేసినట్లు రైల్వే ఎస్సై పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత..

దోమకొండ: కడుపునొప్పి భరించలేక ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై మురళి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొర్నిపాటి లక్ష్మీతిరుపతమ్మ(22) ఏడాది నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. పలు ఆసుపత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి తండ్రి చాగంటి నాగేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుటుంబ తగాదాలతో మరొకరు..

నవీపేట: మండలంలోని యంచ శివారులోని గోదావరి నదిలో దూకి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని చంద్రశేఖర్ కాలనీకి చెందిన షేక్ సలీం(36) కుటుంబ తగాదాలతో గోదావరి నది దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య తబస్సుం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొడుకును చంపిన తండ్రి



శ్రీకాంత్ (ఫైల్)

నవీపేట: రెండో పెళ్లి చేసుకునేందుకు అడ్డంకిగా మారిన కొడుకును తండ్రి దారుణంగా హతమార్చిన ఘటన మోకన్‌పల్లిలో శనివారం చోటుచేసుకుంది. నిజామాబాద్ నార్త్ జోన్ సీఐ సతీశ్, ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగెం కిషన్ భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. తనకున్న 20 గుంటల భూమిని అమ్మగా రూ. 9 లక్షలు వచ్చాయి. దీంతో అప్పులు తీర్చగా మిగిలిన రూ. నాలుగు లక్షల నగదును తన దగ్గరే ఉంచుకున్నాడు. ఈ విషయమై తండ్రి కిషన్ కొడుకు శ్రీకాంత్(25) మధ్య నిత్యం గొడవ జరిగేది. తాను రెండో పెళ్లి చేసుకుంటానని, డబ్బులు ఇచ్చేది లేదని కిషన్ చెప్పాడు. దీంతో శనివారం రాత్రి రెండో పెళ్లి చేసుకోవద్దని తండ్రితో గొడవపడ్డాడు. దీంతో తన రెండో పెళ్లికి అడ్డుగా వస్తున్నాడనే కోపంతో ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న శ్రీకాంత్ తలపై కర్రతో బాది చంపాడు. మృతుడి భార్య రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్సై పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..



ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు

బీబీపేట: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన తుజాల్‌పూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక మండలం ఆకారం గ్రామానికి చెందిన అబ్రబోయిన నర్సింలు (45) వృత్తి రీత్యా చేపలు పడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం సాయంత్రం తుజాల్‌పూర్– ఆకారం గ్రామాల మధ్య ఉన్న వాగులో చేపల వేటకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం తుజాల్‌పూర్ వాగులో మృతదేహం లభ్యమైంది. వాగులో వేసిన మోటర్ల వల్లే విద్యుత్ షాక్ తగిలి నర్సింహులు మృతి చెందాడని కుటుంబీకులు, బంధువులు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి తల్లి కిష్టవ్వ ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుప్రియాల్‌లో భూవివాదం



గుమ్మిగూడిన ఇరు సంఘాల సభ్యులు

సదాశివనగర్: మండలంలోని కుప్రియాల్‌లో రెడ్డిసంఘం, బేస్త సంఘం సభ్యుల మధ్య ఆదివారం వివాదం తలెత్తినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని రెడ్డి సంఘాల సభ్యులు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఫంక్షన్ హాలుగా మార్చుతున్నారని బేస్త సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఈ విషయమై బేస్త సంఘం వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలానికి చేరుకున్న ఏఎస్సై నర్సయ్య రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. సోమవారం భూసమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. ఈ భూవిషయంలో సంబంధిత రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బేస్త సంఘం సభ్యులు ఆరోపించారు. ప్రభుత్వ భూమిలో తమ సంఘానికి భూమి కేటాయించాలని కోరారు.

ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

ఖలీల్‌వాడి: ఆర్మూర్ పీఎస్ ఏఆర్ కానిస్టేబుల్ కణికరం నటరాజుపై చీటింగ్, రేప్ కేసు నమోదు కావడంతో సస్పెన్షన్ చేస్తున్నట్లు సీపీ కల్మేశ్వర్ ఆదివారం తెలిపారు. వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన తన స్నేహితుని భార్యను లొంగదీసుకొని పెళ్లి చేసుకుంటానని నమ్మించి భర్తతో విడాకులు ఇప్పించాడు. పెళ్లి విషయమై బాధితురాలి తల్లిదండ్రుల ఇటీవల నటరాజును సంప్రదించగా అతను కొట్టి పంపించాడు. దీంతో బాధితురాలు పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. నటరాజుపై చీటింగ్, రేప్, ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు కావడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగానే నటరాజును సస్పెన్షన్ చేసినట్లు సీపీ తెలిపారు.